క్లుప్తంగా

శిక్షణ కేంద్రం సీఈకి ఉద్యోగుల సత్కారం



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లోని ఏపీ జెన్‌కో శిక్షణా కేంద్రం చీఫ్ ఇంజినీర్‌గా ఇటీవల కాలంలో బాధ్యతలు స్వీకరించిన నాగభూషణంకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవీ కిరణ్ మాట్లాడుతూ దేశ స్థాయిలో పేరెన్నికగల శిక్షణ సంస్థ కీర్తి ప్రతిష్టలు మరింత ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు, అధికారుల సహకారంతో సంస్థ పురోభివృద్ధికి కృషిచేస్తానని సీఈ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్, బ్రాంచి అధ్యక్షుడు ఉమావిజయ్ చంద్, కళ్యాణ్‌కుమార్, సత్యప్రసాద్, వెంకటరమణ పాల్గొన్నారు.

హిందీ పరీక్షలకు 156 మంది హాజరు



తిరువూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో తిరువూరు సర్వోదయ స్కూలులో ఆదివారం నిర్వహించిన హిందీ పరీక్షలకు 156 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర, ప్రవేశిక పరీక్షలు నిర్వహించినట్లు పరీక్షా కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ రమణమూర్తి తెలిపారు. పరీక్షలను హిందీ ప్రచారక్ రేపాక రఘునందన్ పర్యవేక్షించారు.

రేపు రజబ్ పండుగ నిర్వహణకు ఏర్పాట్లు

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్‌లో ఈనెల 14వ తేదీ మంగళవారం ఇమామే జాఫర్ సాధిక్ వారి రజబ్ పండుగను నిర్వహిస్తున్నట్లు దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొహీద్దీన్ షా తాజ్ ఆదివారం తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పాయసం, కజ్జికాయల పవిత్ర మహా ప్రసాదం వితరణ జరుగుతుందన్నారు. ఈ దర్బార్లో సూఫి మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా ఆశీస్సులతో ఐదు తరాలుగా హాజరత్ ఇమామే జాఫర్ సాధిక్ పవిత్ర రజబ్ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుల మతాలకు అతీతంగా పాల్గొనే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి

రెడ్డిగూడెం: నాగార్జున సాగర్ 3వ జోన్‌లోని ఎడమ కాలువ ద్వారా గత 3 నెలలుగా 1800 క్యూసెక్కుల నీరు పశ్చిమ కృష్ణాలోని 2 లక్షల ఎకరాలకు రావాల్సి ఉన్నప్పటికీ సరఫరా కాలేదని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ట్రిబ్యునల్ ఉన్నప్పటికీ అవికేవలం అలంకార ప్రాయంగా మారిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తన ఇష్టానుసారంగా కల్లూరు మేజర్ నుంచి నీరు కిందకు రాకుండా 3వ జోన్ ప్రాంతాన్ని ఎడారిగా మారుస్తున్నారన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులలో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ మన వాటా రానివ్వడం లేదన్నారు. ఆంధ్ర ప్రాంతానికి నీరు విడుదల చేయాలని రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు.

కార్మికులను ఆదుకోవాలి

కీసర(కంచికచర్ల): భవన నిర్మాణ రంగ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా యూనియన్ అధ్యక్షుడు జి.హరికృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కీసర ఆంజనేయస్వామి కల్యాణమండలంలో గండేపల్లి, కీసర, వేములపల్లి, పెండ్యాల గ్రామాల భవన నిర్మాణ రంగ కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల భద్రత కోసం 1996 కేంద్ర చట్టాన్ని అనుసరించి సంక్షేమ బోర్డుకు కేటాయించిన నిధులను కార్మికుల కోసం ఖర్చు చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడుగా పల్లె రాయప్ప, ప్రధాన కార్యదర్శిగా కోయా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కాకుమాను రామారావు, అవుదొడ్డి బాబు, సహాయ కార్యదర్శులుగా జీనేపల్లి స్వామి, పసుపులేటి రాజేష్, కోశాధికారిగా నాగులపాటి శేషాచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ మీర్జావలి, జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల కుమార్, పిల్లా శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కంచికచర్ల: రెండు బైకులు ఎదురుగా వస్తూ ఢీకొనగా ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం కంచికచర్లకు చెందిన గర్నెపూడి హరీష్ అనే వ్యక్తి బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ఘటనలో హరీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని విజయవాడ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

అర్హత ఉండీ పథకాలు అందకపోతే చెప్పండి

- ఎమ్మెల్యే రక్షణనిధి
- తిరువూరు 11వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



తిరువూరు 11వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: అర్హత ఉండీ పథకాలు అందకపోతే చెప్పండి, ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి అని తిరువూరు ఎమెల్యే కే రక్షణనిధి కోరారు. తిరువూరు 11వ వార్డులో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని పలువురు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే ఆయా పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఏవైనా ఇబ్బందులుంటే తమకు తెలియజేయాలని, వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులకు ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ సొమ్మును వలంటీర్లు అందజేస్తున్నారని, అర్హత ఉండీ పెన్షను రానివారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సిటిజన్ ఔట్ రీచ్ కార్యక్రమంతో పథకాల లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ తీసుకుంటోందని పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వార్డు కౌన్సిలర్లు కాకర్లమూడి సుందర కుమార్, మోదుగు ప్రసాద్, తంగిరాల వెంకటరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు వెలుగోటి ఆదినారాయణ, కాలసాని గోపాల నాగేశ్వరరావు, గుంటూరు మస్తాన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై వైద్యశాఖ అప్రమత్తం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని



లార్వా గుర్తింపు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ పాలిటెక్నిక్ హాస్టల్‌లోని విద్యార్థులకు జ్వరాలు సోకడంపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. అందులో భాగంగా ఆ ప్రాంతానికి చెందిన లబ్బీపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి, నిర్ధారణ పరీక్షలు చేశారు. వారిలో ఎనిమిది మంది టైఫాయిడ్, ఒకరు డెంగీతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. వారిలో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా డెంగీ కేసు నమోదు కావడంతో ఆ ప్రాంతంలో డెంగీ లార్వాను గుర్తించేందుకు జల్లెడ పడ్డారు. నిల్వనీటిని గుర్తించి, వాటిలోని లార్వాను నిర్వీర్యం చేశారు. లార్వా నాశన మందులు చల్లి, ఫాగింగ్ చేశారు. లబ్బీపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మెబీనా తన సిబ్బందితో అక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరబాధితులకు చికిత్స చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందిని పిలిపించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అందరికీ జ్వర నిర్ధారణ పరీక్షలు చేశామని, ఒకరికి డెంగీగా నిర్ధారణ కావడంతో అప్రమత్తమైనట్లు తెలిపారు. ఇక్కడే వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె.నరసింహనాయక్, బయాలజిస్ట్ సూర్యకుమార్ పాల్గొన్నారు.

మహిమాన్వితుడు బలివే రామలింగేశ్వరుడు

- బలి చక్రవర్తి పాలించిన ప్రాంతమే బలివే
- 17 నుంచి 19 వరకు మహాశివరాత్రి
- దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏటా ఉత్సవాలు
- 2 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా





బలివే రామలింగేశ్వరాలయం (ఇన్‌సెట్) అలంకరణలో ఉన్న బలే రామస్వామి

ముసునూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రసిద్ధ శైవక్షేత్రం బలివేలోని శ్రీరామ లింగేశ్వరాలయం. ఈ ఆలయం పూర్వపు కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల మధ్య ఉంది. తెలంగాణ రాష్ట్రానికి, ప్రాచీన తూర్పు వేంగి చాళుక్యుల రాజధాని వేంగి పురం (నేటి పెదవేగి)కి అతి సమీపాన కృష్ణా జిల్లా, ముసునూరు మండలంలో తమ్మిలేరు ఒడ్డున ప్రశాంత వాతావరణంలో విరాజిల్లుతోంది.

ఆలయ స్థల పురాణం..

ఈ దేవాలయం త్రేతాయుగంలో లింగ ప్రతిష్ఠ జరుపబడినదిగా ప్రతీతి. శ్రీరాముడు రావణ సంహరణానంతరం బ్రహ్మ హత్యా దోష నివారణార్థం మహా స్థలాలను ఎన్నుకుని, ఈశ్వర లింగ ప్రతిష్ఠలు చేసుకుంటూ, అయోధ్య చేరే ముందు మహారణ్యమైన ఈ స్థలంలో ఆహ్లాదకరమైన వాతావరణం చూసి, శివధ్యాన దృష్టి గల భూమిగా గ్రహించి, ఇక్కడ లింగ ప్రతిష్ఠ గావించాడు. సాక్షాత్తూ ఆ పరమశివుని ఆవాహనం చేసి, పూజలు గావించి, పరమేశ్వరుని కృపకు పాత్రులయ్యారు. ప్రసన్నుడైన ఆపరమ శివుడు ఈ అరణ్యంలో నీవు ప్రతిష్ఠించిన భూమికి చుట్టుపక్కలా నూరు (100) లింగ ప్రతిష్ఠలు కాగలవని చెప్పాడు. అప్పటి నుంచి ఈ ప్రదేశంలోని శివలింగాన్ని రాముడు ప్రతిష్ఠించిన కారణంగా రామలింగేశ్వర ఆలయంగా పిలుస్తున్నారు. తదనంతర కాలంలో ఈ ప్రాంతాన్ని బలి చక్రవర్తి పరిపాలించడంతో, బలివేగా పేరు గాంచింది. రాముడు ప్రతిష్ఠించిన శివలింగం బలివేలో నెలకొని ఉండడంతో ఈ ఆలయాన్ని బలే రామలింగేశ్వరస్వామి ఆలయంగా భక్తులు పిలుచుకుంటున్నారని స్థానికుల నమ్మకం. స్వామివారి ఆలయం చెంత, అమ్మవారి ఆలయం కూడా ఉండాలని, ఈ ప్రాంతానికే చెందిన మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ 2011వ సంవత్సరంలో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. తాత గుడిగా ప్రసిద్ధి చెందిన మృత్యు మల్లేశ్వరాలయం. కల్యాణం అనంతరం స్వామివారు రథోత్సవంతో తరలివచ్చి తాతగారి ఆశీస్సులు పొందడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రత్యేక బస్సులు..

రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న బలేరామ లింగేశ్వరాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న దృష్ట్యా మొత్తం 5 విభాగాలుగా నూజివీడు, ఏలూరు, సత్తుపల్లి ఆర్టీసి డిపోల నుంచి బస్సులు నడుపుతున్నారు.

పటిష్ట ఏర్పాట్లు..

ఏలూరు జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు, మూడు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ దాసరి సుధ నోడల్ అధికారిగా, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజీంద్రన్, డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాల ఏర్పాట్లు ప్రారంభించగా, తమ్మిలేరు జలాశయం నుంచి నీటిని కూడా విడుదల చేశారు. ఇప్పటికే దుకాణాలు, వినోద సౌకర్యాలు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నారు.

అలరించిన ఘంటసాల స్వరార్చన



ఘంటసాల స్వరార్చన కార్యక్రమంలో పాటలు పాడుతున్న గాయకులు

నూజివీడు: పట్టణంలో ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని ఘంటసాల స్వరార్చన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నూజివీడు కళా వేదిక, శ్రీ సత్య సంగీత, నృత్య అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ముందుగా ఘంటసాల చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు ఔత్సాహిక గాయనీ గాయకులు ఘంటసాల పాడిన పాటలు ఆలపించారు. ఘంటసాలను గుర్తు చేసుకున్నారు.

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఘంటసాల పాటలు అజరామరమని, గాయకుడిగానే కాకుండా సంగీత దర్శకుడిగా కూడా రాణించిన ఘనత ఘంటసాలకే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పురాణం కృష్ణప్రసాద్, వేంపాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చార్లెస్ డార్విన్ ఆవిష్కరణలు అద్భుతం

జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్



తిరువూరులో డార్విన్ జయంతి

తిరువూరు: జీవపరిణామక్రమ సిద్ధాంతాన్ని విప్లవీకరించిన చార్లెస్ డార్విన్ ప్రపంచ గతినే మార్చివేశారని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ అన్నారు. ఆదివారం డార్విన్ జయంతిని సందర్భంగా తిరువూరు సిద్ధార్థ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. జీవుల ఆవిర్భావంపై ఉన్న మూఢ నమ్మకాలు, విశ్వాసాలను పటాపంచలు చేస్తూ డార్విన్ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా విశేషంగా ఆదరణ పొందిందని ఆయన పేర్కొన్నారు. డార్విన్ జీవిత విశేషాలను, ఆయన ఆవిష్కరణలను ఉపాధ్యాయులు రాంప్రదీప్, సుదర్శన్, చక్రపాణి వివరించారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

దంతాలను సంరక్షించుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న దంత వైద్యులు దినేష్‌బాబు

నూజివీడు: పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో శ్రీభాను స్మైల్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యులు దేవిశెట్టి దినేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దంతాలను పరిరక్షించుకునే విషయంలో శ్రద్ధ వహించాలన్నారు. రోజుకు రెండు సార్లు దంతాలను శుభ్రపరుచుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు, జర్నలిస్టులకు, ఆర్టీసీ సిబ్బందికి ఈహెచ్‌ఎస్ ద్వారా నగదు రహిత ఉచిత వైద్య సదుపాయం ఉందన్నారు. అనంతరం పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈకార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రకళా ప్రదర్శన



చిత్రకళా ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): చిత్రకారులను ప్రోత్సహించేలా పోటీలు నిర్వహించి బహుమతులందించడం అభినందనీయమని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(హైదరాబాద్) రిజిస్ట్రార్, ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్ అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో క్రియేటివ్ హార్ట్స్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మాస్టర్ స్ట్రోక్- పేరిట చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన 45 మంది చిత్రకారులు ప్రదర్శించిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుందర్‌కుమార్ ప్రదర్శనను ప్రారంభించి తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాల్లోనే కాకుండా పల్లెల్లో చిత్రకళ అభివృద్ధికి క్రియేటివ్ ఆర్ట్స్ సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. సీనియర్ చిత్రకారుడు డి.శివప్రసాద్ మాట్లాడుతూ చిత్రకళ అనేది ప్రతి మనిషిలో ఉన్న అంతర్గత, మానసిక పరిస్థితిని ప్రతిబింబించే గొప్ప సాధనమన్నారు. ఇది మనిషికి ఎంతో ఆనందాన్ని, ఆలోచనలను కలిగిస్తాయన్నారు. చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసి చిత్రకారులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకుడు అంజి ఆకొండిని అభినందించారు. ఏపీ దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కె.శైలజ భరత్ మాట్లాడుతూ చిత్రకళ దేవుడిచ్చిన వరమన్నారు. చిత్రకళా ప్రదర్శన కోసం అమలాపురంలో గ్యాలరీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలపారు. క్రియేటివ్ హార్ట్స్ వ్యవస్థాపకుడు అంజి ఆకొండి మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా ఎంతోమంది చిన్నారులకు, చిత్రకారులకు వివిధ చిత్రకళ పోటీలు, ప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ చిత్రకళ అభివృద్ధికి, చిత్రకారుల గుర్తింపు కోసం కృషి చేస్తున్నానని తెలిపారు. తెలుగు అండ్ సంస్కృతం అకాడమీ మెంబర్ డాక్టర్ కె.రామకృష్ణ, 64 కళలు ఎడిటర్ వై.కళాసాగర్ మాట్లాడారు.

నేడు 'స్పందన'

నూజివీడు: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

- **గంపలగూడెం:** గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే కార్యక్రమంలో సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చన్నారు.
- **ఎ.కొండూరు:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఈ స్పందనలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొంటారని ప్రజా సమస్యలపై అర్జీలు అందజేస్తే పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం తగదు

వైఎస్సార్ సీపీ నేతలు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత నాగరాజు, ప్రతాప్, నోవా తదితరులు

మైలవరం: మైలవరం నియోజకవర్గ శాసన సభ్యుడు వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌పై కొంత మంది సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది ప్రజలను తప్పు దోవ పట్టించే విధంగా లేని పోని ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ అధికార ప్రతినిధి కుమ్మరి నాగరాజు తెలిపారు. మైలవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ దళిత సామాజిక వర్గం నాయకులు ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుమ్మరి నాగరాజు మాట్లాడుతూ 2018 ఏప్రిల్ 18 నుంచి నియోజకవర్గ సమన్వయకర్తగా కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, ఎమ్మెల్యేగా ఎన్నికై నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాల ప్రజలను గౌరవిస్తూ అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. దీన్ని ఓర్వలేక కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దళిత జేఏసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి ప్రతాప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ సహకారంతో నియోజకవర్గంకు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రకటించినట్లు 175కు 175 స్థానాలు గెలవాలన్న నినాదంతో దళితులంతా సమైక్యంగా కృషి చేసి మైలవరం నుంచి వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకర్గ ప్రజలు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వెంటే ఉన్నారని, 2024లో మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. సమావేశంలో నాయకులు వీరమళ్ల సుధాకర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ మందా నోవా, యేసుబాబు, పొందుగల మాజీ సర్పంచ్ డొంకెన చలపతిరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తలశిల రఘురామ్‌కు పరామర్శ



తలశిల రఘురామ్‌ను పరామర్శిస్తున్న నటుడు అలీ, చిత్రంలో మంత్రి జోగి రమేష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌కు పరామర్శలు కొనసాగుతున్నాయి. రఘురామ్ సతీమణి స్వర్ణకుమారి అనారోగ్యంతో ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి పలువురు ఎంపీలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని ఆయన నివాసానికి వచ్చి రఘురామ్, కుటుంబసభ్యులను పరామర్శిస్తునే ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీ నటుడు అలీ, మంత్రి జోగి రమేష్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు రంగనాథరాజు, సింహాద్రి రమేష్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి(శేషు), ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ పీ గౌతంరెడ్డి, డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి రఘురామ్ నివాసానికి వచ్చారు. తొలుత స్వర్ణకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రఘురామ్, ఆయన కుమార్తె ప్రణవ, సోదరులు దూళిపాళ శ్రీకాంత్, శ్రీనాథ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు.

దివ్యాంగులకు అన్నదానం

ఇబ్రహీంపట్నం: గుడ్ సమరిటన్ సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రేమ్‌నికేతన్ సంస్థలో దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం ఆదివారం జరిగింది. ట్రస్ట్ అధ్యక్షుడు చిట్టేలు కోటేశ్వరరావు అధ్యక్షతన మానసిక, అంగవైకల్యం కలిగిన చిన్నారులతో సభ్యులు కొద్దిసేపు గడిపారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చవల ఉదయభాస్కర్, మల్లేశ్వరి దంపతుల కుటుంబంలో జరిగిన మేలుకు కృతజ్ఞతగా 25కిలోల బియ్యం, నిత్యవసరాలు సంస్థకు అందజేశారు. ట్రస్ట్ కార్యదర్శి వేల్పుల రాజేష్, చిట్టేలు హరీష్, సింగంశెట్టి వాసు, కోకిల, సురేష్, మౌనిక పాల్గొన్నారు.

రూ.2 లక్షల విరాళం

గోసవీడు(గంపలగూడెం): గోసవీడు శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయ గోపుర పునర్నిర్మాణానికి దాతలు రూ.2 లక్షలు విరాళం ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన దివంగత నేరెళ్ల సుబ్బయ్య, రత్తమ్మల జ్ఞాపకార్థం కుమారులు నేరెళ్ల నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావు, రోశయ్య, బాబు ఈ మొత్తాన్ని విరాళాన్ని కమిటీ సభ్యులు నేరెళ్ల సతీష్, సుభాష్‌లకు అందజేశారు.

మన ఇంటి నుంచే భద్రతా చర్యలు

సెంట్రల్ ఏసీపీ ఖాదర్ బాషా

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు పాటించడం మన ఇంటి నుంచే ప్రారంభిద్దాం.. సమాజానికి ఆదర్శంగా నిలుద్దామని సెంట్రల్ ఏసీపీ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. అంతర్జాతీయ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ డేను పురస్కరించుకుని అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఈ ర్యాలీని ఏసీపీ ఖాదర్‌బాషా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు, డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు డాక్టర్ మెహబూబ్‌షేక్ అధ్యక్షతన జరిగిన సభలో ఏసీపీ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వైద్యుల ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ ఎస్.కోటేశ్వరరావు, డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడారు. సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఈ ర్యాలీలో సుమారు 200 మందికి పైగా వైద్యులు, దంత వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

14న క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

గణపవరం(మైలవరం): మైలవరం మండలం గణపవరం గ్రామంలో ఈ నెల 14న క్యాన్సర్‌పై అవగాహన సదస్సు జరుగుతుందని గ్రామ సర్పంచ్ తమ్మ సీతారావమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గణపరంలో జరిగే వైద్య శిబిరం డాక్టర్ ఆర్.నరేష్, డాక్టర్ ప్రియాంక పర్యవేక్షణలో జరుగుతుంది. కేన్సర్ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తారు. దీర్ఘకాలిక వ్యాధుల గురించి రక్త పరీక్షలు, ఆరోగ్యశ్రీపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయి. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎన్.సుష్మ, ఏఎన్ఎమ్‌లు పాల్గొంటారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సర్పంచ్ సీతారావమ్మ కోరారు.

ఇసుక లోడు ట్రాక్టర్ స్వాధీనం

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కొటికలపూడి గ్రామంలో శనివారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్, డ్రైవర్‌ను ఇబ్రహీంపట్నం పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. గ్రామంలో విచ్చలవిడిగా రోడ్లపై ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండటంతో ఇళ్లలోని ప్రజలకు ప్రశాంతత లేకుండా పోతోందని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.